సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 22 । జనవరి । 2025




ఘనంగా అష్టదళ పద్మారాధన

విశాఖ నగరంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.



ముగిసిన అధ్యయనోత్సవాలు

అనకాపల్లి జిల్లా ఉపమాక వెంకన్న ఆలయంలో నిర్వహిస్తున్న రాపత్తు అధ్యయన ఉత్సవాలు సోమవారం రాత్రి ముగిశాయి.



అప్పన్నకు నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారికి మంగళవారం నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

30న చింతపల్లిలో ప్రేరణ

- అదే రోజు నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు
- గూడెంకొత్తవీధి సీఐ వరప్రసాద్

గూడెంకొత్తవీధి: జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ప్రేరణ కార్యక్రమాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని గూడెంకొత్తవీధి సీఐ వరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 30న చింతపల్లిలో ప్రేరణ కార్యక్రమంలో భాగంగా నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.ఇన్నోవ్ సోర్స్ ప్రయివేట్ లిమిటెడ్ సహకారంతో టాటాఎలక్ట్రానిక్స్ సంస్థలో ఉద్యోగాలను కల్పిస్తారన్నారు. 18 నుంచి 25ఏళ్ల వయసు కలిగిన గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు పది, డిప్లమో, ఇంటర్, ఐటీఐ , డిగ్రీ తదితర విద్యార్హత కలిగి ఉన్న వారు నేరుగా తమ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వివరాలు సమర్పించాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి సదుపాయంతో శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. విశాఖపట్నం, నర్సాపూర్, కోలార్, హోసూరు, బెంగళూరు వంటి ప్రాంతాల్లోని పేరొందిన కంపెనీల్లో నియామకాలు ఉంటాయన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయనతోపాటు ఎస్‌ఐ అప్పలసూరి కోరారు.

రిసోర్స్ పర్సన్ల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

- ఈనెల 26 వరకు గడువు
- జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ

పాడేరు : ప్రధానమంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్‌ఎంఈ)ను సమర్థవంతంగా అమలుచేసేందుకు మండల స్థాయిలో రిసోర్స్ పర్సన్లను ఎంపిక చేస్తామని జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 నవంబర్ 1వతేదీ నాటికి 21 నుంచి 30 సంవత్సరాల వయసు కలిగి ఉండి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత పొంది కంప్యూటర్, ఇంటర్నెట్‌లో ప్రావీణ్యం ఉండి, సొంత స్మార్ట్ ఫోన్ కలిగి ఉన్న ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. వీటిని ఈనెల 26లోగా ఆయా మండలాల్లో ఉన్న వెలుగు కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్, సహజ వనరుల అభివృద్ధి రంగాల్లో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఫుడ్ ప్రాసెసింగ్ వ్యవస్థాపకులను పీఎంఎఫ్‌ఎంఈ పథకంలో చేరేలా ప్రోత్సహించాల్సి ఉందన్నారు. డీపీఆర్ తయారు చేయడం, బ్యాంకు రుణాలు మంజూరు చేయడం, ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ఉద్యోగ్ ఆధార్, జీఎస్టీ, ఆహార ప్రమాణాలతో సహా రిజిస్ట్రేషన్, లైసెన్సులు పొందే విధంగా అవగాహన కల్పించాల్సి ఉంటుందన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఏకలవ్యలో ప్రవేశాలకు 19 వరకు దరఖాస్తు గడువు

డుంబ్రిగుడ: ఏకలవ్య పాఠశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి 6వతరగతిలో ప్రవేశానికి వచ్చేనెల 19 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని స్థానిక మోడల్ గురుకుల ప్రిన్సిపాల్ డాక్టర్ సుమంత్‌కుమార్ సింగ్ తెలిపారు. ఈసందర్భంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంగ్లీష్ మీడియం, సీబీఎస్‌ఈ సిలబస్‌తో నడుపబడుతున్న ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయాంలో అన్ని సీట్ల భర్తీకి గురుకులం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని ఆయన సూచించారు.

సుంకరమెట్ట లైన్‌మన్‌కు ప్రమాదం

- విద్యుత్ స్తంభంపై నుంచి పడటంతో తీవ్ర గాయం
- పరిస్థితి విషమం
- కేజీహెచ్‌కు తరలింపు



అరకు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లైన్‌మన్ గెమ్మెలి ప్రసాద్

అరకులోయ టౌన్: మండలంలోని ఏపీఈపీడీసీఎల్ సుంకరమెట్ట లైన్‌మన్ గెమ్మెలి ప్రసాద్ (38) ప్రమాదానికి గురయ్యారు. మంగళవారం సుంకరమెట్ట హౌసింగ్ కాలనీలో విద్యుత్ స్తంభం నుంచి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అతనిని హుటాహుటిన సుంకరమెట్ట పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. తక్షణ వైద్యం అందించిన వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. తల వెనుక వైపు బలమైన గాయమైంది. లైన్‌మన్ డుంబ్రిగుడ మండలం పెదపాడు గ్రామమని స్థానికులు తెలిపారు.

ప్రకృతి సొగసు






చింతపల్లి ప్రాంతంలో మంచు అందాలు ప్రకృతి ప్రేమికులను మైమరిపిస్తున్నాయి. గత వారం రోజులుగా ఈ ప్రాంతంలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు తగ్గిపోతున్నాయి. ఈనెల 19, 20 తేదీల్లో చింతపల్లిలో 7.3 డిగ్రీలు నమోదుకాగా, **21న 5.5 డిగ్రీలకు పడిపోయింది. ఎదుటి** వాహనాలు కనిపించలేనంతగా మంచు దట్టంగా కురుస్తోంది. పచ్చని మొక్కలపై హిమ జల్లులు గూడు కట్టుకున్నాయా అన్నట్టుగా సాలెగూడులు చూపరులను కట్టిపడేస్తున్నాయి. చెట్ల మధ్య మంచు తెరలను **చీల్చుకుంటూ భానుడి కిరణాలు నేలను తాకే దృశ్యాలు అబ్బురపరుస్తున్నాయి.** చలిగాలులు విజృంభిస్తుండటంతో ఉదయం, సాయంత్రం వేళలో మంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు. ఉదయం వేళ కూలి పనులు, కాఫీ తోటలకు వెళ్లే కార్మికులు చలితో ఇబ్బంది పడుతున్నా.. మంచు అందాలను ఆస్వాదిస్తున్నారు. - చింతపల్లి

పసందైన లాభాలు

మన్యం కూర పనసకు ఐదు రాష్ట్రాల్లో గిరాకీ

పనస పిందెల **వ్యాపారంతో గిరిజనులు, ఒడిశా వ్యాపారులు మంచి ఆదాయం పొందుతున్నారు.** మన్యంలో కొనుగోలు **చేసిన** పనస పిందెలను ఐదు **రాష్ట్రాలకు** ఎగుమతి చేస్తూ **కాసులు** ఆర్జిస్తున్నారు. **ప్రస్తుతం సీజన్** మొదలుకావడం**తో కొనుగోళ్లు ఊపందుకున్నాయి.**

- పనస పిందెల **కొనుగోళ్లు ప్రారంభం**
- పోటీపడి కొనుగోలు **చేస్తున్న** ఒడిశా వ్యాపారులు
- ఐదు రాష్ట్రాలకు ఎగుమతి
- పశ్చిమ బెంగాల్, ఒడిశా, బిహార్‌లో భలే డిమాండ్
- గిరిజనులకు మంచి ఆదాయం
- వ్యాపారులకు రెట్టింపు ప్రయోజనం



పనస పిందెలు



ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు హుకుంపేటలో వ్యాపారులు కొనుగోలు చేసిన పనస పిందెలు

పెదబయలు: మన్యంలో లభించే పనస (కూర) పిందెకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. వీటితో తయారుచేసే వంటకాలు రుచికరంగా ఉన్నందున తెలుగు రాష్ట్రాలతోపాటు పశ్చిమ బెంగాల్, ఒడిశా, బిహార్‌లోని మార్కెట్లలో వినియోగదారులు కొనుగోలు చేస్తుంటారు. మంచి గిరాకీ ఉన్నందున ఒడిశా వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేసి ఎగుమతి చేస్తున్నారు.

నాలుగు నెలలు.. మంచి గిరాకీ

జనవరి నుంచి ఏప్రిల్ వరకు పశ్చిమ బెంగాల్, ఒడిశా, బిహార్ పెళ్లిళ్లు, విందులు ఎక్కువగా జరుగుతుంటాయి. అందువల్ల ఒడిశా వ్యాపారులు



ఎగుమతి చేసేందుకు పేపర్ ప్యాకింగ్ చేసిన పనస పిందెలు

పనస పిందెల కొనుగోలుపై ఎక్కువగా దృష్టి పెడుతుంటారు. ప్రస్తుతం పనస పిందె సీజన్ ప్రారంభమైంది. పాడేరు మండలంలో దేవాపురం, సలుగు, అయినాడ, వంట్లమామిడి, హుకుంపేట, డుంబ్రిగుడ మండలంలో కించుమండ, అరకు సంత, అరకు మండలంలో సుంకరమెట్ట, పెదబయలు, సీతగుంట, ఒడిశా సరిహద్దు పాడువ, బైలుగుడ, సోభపుట్టు ప్రాంతాల్లో కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో వ్యాపారులు కాటాలు ఏర్పాటు చేసుకుని గిరిజనుల నుంచి సేకరిస్తున్నారు. కొనుగోలు చేసిన పిందెలకు పేపర్‌తో ప్యాకింగ్ చేసి ఎగుమతి చేస్తున్నారు.

ఏడాదిలో రెండు సీజన్లు

ఏజెన్సీలో పనస సీజన్ ఏడాదిలో రెండు సార్లు ఉంటుంది. మొదటి కాపు కూర (పిందె) పనస. జనవరి నుంచి ప్రారంభమై ఫిబ్రవరి నెలాఖరుతో ముగుస్తుంది. రెండో సీజన్ (పండ్లు) ఏప్రిల్ నుంచి మే వరకు ఉంటుంది. గిరిజనుల నుంచి వ్యాపారులు పక్వానికి వచ్చిన కాయలను కొనుగోలు చేసి తరలిస్తుంటారు. ప్రస్తుత సీజన్‌లో రూ.50 లక్షల మేర వ్యాపారం జరుగుతుంది. ఇళ్ల వద్ద, అటవీ ప్రాంతంలోని చెట్ల నుంచి సేకరించిన పిందెలను గిరిజనులు విక్రయిస్తున్నారు. సుమారు రెండు కిలోల బరువు ఉన్న పిందెను రూ.30 వరకు వ్యాపారులు చెల్లిస్తున్నారని రైతులు తెలిపారు. గ్రామాల్లోకి వచ్చి కూడా వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని వారు వివరించారు. సుమారు 40 కిలోల బరువు ఉన్న పిందెల బస్తాకు వ్యాపారులు **రూ.800 నుంచి రూ. వెయ్యి వరకు** ధర చెల్లిస్తున్నారని **గిరి రైతులు చెబుతున్నారు.**

పనస పొట్టు భలే రుచి

లేత పనస పిందెల నుంచి సేకరించిన పొట్టుతో తయారు చేసిన వంటకాలు మంచి రుచికరంగా ఉంటాయి. ఒడిశాలో పనసపొట్టు వినియోగం ఎక్కువగా ఉంటుంది. పొట్టుతో కూరతోపాటు ఇతర వంటకాలు తయారు చేస్తుంటారు. అలాగే అక్కడ జరిగే పెళ్లిళ్ల, విందులో పనస పొట్టు కూర తప్పనిసరిగా ఉంటుంది. దీంతో ఒడిశా మార్కెట్‌లో గిరాకీ ఉంది.

వ్యాపారులకు మెరుగైన ఆదాయం

పనస పిందెలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తూ వ్యాపారులు మంచి ఆదాయం పొందుతున్నారు. ఏజెన్సీలో గిరిరైతుల నుంచి సుమారు రూ.వెయ్యికి కొనుగోలు చేసిన బస్తా పిందెలను ఇతర రాష్ట్రాల్లో సుమారు రూ.2 వేలకు విక్రయిస్తున్నారు. ఇక్కడి నుంచి ప్రత్యేకంగా లారీలు, వ్యాన్లలో తరలిస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు.

ధర బాగుంది



గతంలో పనస కాయలు పక్వానికి వచ్చిన తరువాత పండ్లను కోసుకుని తినేవాళ్లం. సీజన్‌లో తక్కువ ఆదాయం వచ్చేది. గత మూడేళ్ల నుంచి ఒడిశా వ్యాపారులు గ్రామాలకు వచ్చి పనస పిందెలను కొనుగోలు చేస్తున్నారు. కిలో పిందెకు రూ.30 వరకు ధర చెల్లిస్తున్నారు. దీనివల్ల మంచి ఆదాయం పొందగలుగుతున్నాం. పండ్లు కన్నా పిందెల అమ్మకాల ద్వారా మంచి ఆదాయం వస్తోంది. – పాంగి సన్యాసిరావు, జామిగుడ, పెదబయలు మండలం

పర్యాటక యూనిట్ల తనిఖీ

పరిశీలించిన టూరిజం ఎండీ ఆమ్రపాలి



పర్యాటక యూనిట్లను పరిశీలిస్తున్న టూరిజం ఎండీ, సీఈవో ఆమ్రపాలి

అరకులోయ టౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ, అనంతగిరిలోని పర్యాటక యూనిట్లను టూరిజం ఎండీ, సీఈవో ఆమ్రపాలి తనిఖీ చేశారు. అరకులోయలోని పున్నమి వ్యాలీ రిసార్ట్, మయూరి హిల్ రిసార్ట్స్‌తోపాటు అమీబా కాటేజీలు, అనంతగిరి హిల్ రిసార్ట్‌లను సందర్శించారు. రిసార్టుల్లో కార్మికుల పనితీరు, ఆదాయం తదితర వివరాలు తెలుసుకున్నారు. ఏమైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని టూరిజం అధికారులను కోరారు.

పది వాహనాలకు జరిమానా



వాహన రికార్డులను పరిశీలిస్తున్న ఆర్టీవో రాజేష్‌కుమార్

అడ్డతీగల: రికార్డులు సక్రమంగాలేని పది వాహనాలకు రూ.38 వేల జరిమానా విధించినట్లు రంపచోడవరం ఆర్టీవో ఆర్.రాజేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం అడ్డతీగల–ఏలేశ్వరం మార్గంలో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. జరిమానా విధించిన వాటిలో ఆటోలు, జీపులు, బైక్‌లు ఉన్నాయని ఆయన తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించుకోకపోవడంతో పాటు కొన్నింటికి పర్మిట్లు లేకుండానే రాకపోకలు సాగిస్తున్నట్లు గుర్తించామన్నారు. డ్రైవర్లకు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సులు ఉండాలన్నారు. ప్రతి వాహనానికి ఫిట్నెస్ చేయించడం తప్పనిసరి అని అన్నారు. రవాణా శాఖ నిబంధనల ప్రకారం తగిన రికార్డులు తనిఖీల్లో చూపకుంటే వాహనాలను సీజ్ చేస్తామని ఆర్టీవో హెచ్చరించారు.

జోలాపుట్టులో సీ ప్లాన్ ప్రాజెక్టుపై సర్వే

మత్స్యగెడ్డ పరివాహ క ప్రాంతం పరిశీలన



జోలాపుట్టు జలాశయాన్ని పరిశీలిస్తున్న టూరిజం, రెవెన్యూ అధికారులు



గొడ్డిపుట్టు మత్స్యగెడ్డ ఒడ్డున సర్వే చేస్తున్న టూరిజం అధికారులు

ముంచంగిపుట్టు: ఆంధ్ర ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన జోలాపుట్టు పంచాయతీలోని మత్స్యగెడ్డ పరివాహిక ప్రాంతాల్లో మంగళవారం సీ ప్లాన్ ప్రాజెక్టు ఏర్పాటుపై డ్రోన్ కెమెరాతో పర్యాటక అధికారులు సర్వే నిర్వహించారు. ఇటివల కలెక్టర్ దినేష్‌కుమార్ మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతాల్లో పర్యటించడం తెలిసిందే. పర్యాటకపరంగా అభివృద్ధికి అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటుందని గుర్తించిన ఆయన ఇందుకు సంబంధించి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో స్పైస్ జెట్‌కు చెందిన టూరిజం అధికారులు, తహసీల్దార్ నర్సమ్మ, సర్పంచ్ నీలకంఠం, ఎంపీటీసీ కమల, ఆర్‌ఐ రవికుమార్, ఏపీజెన్‌కో అధికారులు జోలాపుట్టు జలాశయం,గొడ్డిపుట్టు గ్రామ సమీపంలో మత్స్యగెడ్డ ప్రాంతాలను పరిశీలించారు.దీంతో పాటు డ్రోన్ కెమెరా ఫొటోలు, వీడియాలు చిత్రీకరించారు. జోలాపుట్టు జలాశయ స్వరూపం, ఎత్తు, లోతు తదితర వివరాలను సేకరించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వీఆర్వో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయ నిర్మాణానికి స్థల పరిశీలన



ఆలయ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ రాకేష్, తదితరులు

అరకులోయ టౌన్: నియోజకవర్గ కేంద్రమైన అరకులోయలో కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణానికి మంగళవారం ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, స్థానిక ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులతో కలిసి స్థల పరిశీలన చేశారు. గత కొన్నేళ్లుగా అరకులోయలో శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని నిర్మించేందుకు ఆర్యవైశ్యులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అరకులోయ వచ్చిన రాకేష్‌ను స్థానిక ఆర్యవైశ్యుల సంఘం ప్రతినిధులు కలిసి అమ్మవారి ఆలయ నిర్మాణం గురించి వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన స్థానిక ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులతో కలిసి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో స్థలాన్ని పరిశీలించారు. అరకులోయలో అమ్మవారి ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని చైర్మన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకులు బాల గణేష్, సర్పంచ్ దాసుబాబు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు కొల్లా రమేష్‌బాబు, రంగా, వెలగా గుప్త, కొల్లాప్రసాద్, పొట్ట ప్రకాష్, కాపుగంటి గుప్తా, భాస్కర్‌రావు, గణేశ్వరరావు పాల్గొన్నారు.

పసుపు, పిప్పళ్ల సేకరణలో గిరి రైతుల నిమగ్నం



గోమంగిలో పిప్పళ్లు సేకరిస్తున్న రైతులు

పెదబయలు: పసుపు, పిప్పళ్ల సేకరణలో గిరి రైతులు నిమగ్నమయ్యారు. ఏటా డిసెంబర్ చివరి వారం నుంచి పసుపు, పిప్పళ్ల సేకరణ జరుగుతుంది. అయితే మార్కెట్ ధర బాగుంటే గిరిజన రైతులు ఎంతో వేగంగా సేకరించి అమ్మకాలు చేస్తారు. అయితే ఈ ఏడాది పసుపు, పిప్పళ్ల ధర రైతులను నిరాశపరిచాయి. ప్రస్తుతం మార్కెట్లోని ధరలు కష్టానికి తగ్గ ఫలితం ఇచ్చేలా లేవని వారు వాపోతున్నారు. మార్కెట్‌లో ధర తక్కువగా ఉన్నా తప్పనిసరి పరిస్థితుల్లో పసుపు సేకరణ చేయాల్సి వస్తోందని, లేకుంటే పాడై పోతుందని వారు పేర్కొన్నారు. గత ఏడాది పిప్పళ్ల ధర బాగుందని, ఈ ఏడాది మాత్రం తక్కువగా ఉందని వారు వివరించారు.



పసుపు తవ్వకాల్లో గిరిజన రైతులు

మోదకొండమ్మకు కుంకుమార్చన

అరకు ఎంపీ తనూజరాణి, మహిళా కమిషన్ సభ్యురాలు ఉమ ప్రత్యేక పూజలు



ఎంపీ తనూజరాణి, కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమాను సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు



పూజలు చేస్తున్న అరకు ఎంపీ తనూజరాణి, మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లిని అరకు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ గుమ్మా తనూజరాణి,ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమాలు మంగళవారం దర్శించుకున్నారు. మోదమ్మకు కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం వారికి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిముడు కోటిబాబునాయుడు,కాపు సంక్షేమసంఘం నేత దాసరి ఈశ్వరమ్మ,ఇతర కమిటీ సభ్యులంతా శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అమ్మవారి చిత్రపటాలను జ్ఞాపికగా అందజేశారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ తదితరులు

పాడేరు : పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ కోరారు. మంగళవారం తన చాంబర్‌లో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఉచిత పశువైద్య శిబిరాల వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈనెల 20 నుంచి 31వరకు జిల్లా వ్యాప్తంగా 441 కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు పశుసంవర్థక శాఖ అధికారులు జాయింట్ కలెక్టర్‌కు తెలిపారు. ఈ శిబిరాల్లో పశువులకు అవసరమైన చికిత్సలతో పాటు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా అందజేస్తామన్నారు. జేసీ అభిషేక్ గౌడ మాట్లాడుతూ గ్రామాల్లో శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన సదస్సులు నిర్వహించాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ డీడీ డాక్టర్ నర్సింహులు, వెటర్నరీ వైద్యులు డాక్టర్ సృజన, డాక్టర్ రాజీవ్ కిశోర్ పాల్గొన్నారు.

మందుల్లేవ్.. మహాప్రభో..!


మందులు ఇచ్చే గదిలో సిబ్బంది

- కేజీహెచ్‌తోపాటు ప్రధాన ఆస్పత్రుల్లో మందుల కొరత
- గ్లౌజులు, ఇంజక్షన్లు కూడా లేని దుస్థితి
- అత్యవసర మందుల కోసం రోగుల పాట్లు
- గత ప్రభుత్వ హయాంలో నెలరోజులకు సరిపడా మందులు

మహారాణిపేట : ప్రభుత్వ, బోధన ఆస్పత్రుల్లో మందుల కొరత తీవ్రంగా ఉంది. పేదలకు పెద్ద దిక్కుగా ఉన్న కేజీహెచ్‌తోపాటు ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ప్రభుత్వ మానసిక వైద్య శాల, ఈఎన్‌టీ ప్రభుత్వ ఆస్పత్రి, రాణిచంద్రమణి దేవి ఆస్పత్రి, టీబీ, ఐడీ ఆస్పత్రుల్లో మందుల కొరత పట్టిపీడిస్తోంది. వైద్యులు రాసిచ్చిన చీటి పట్టుకొని మందుల కోసం తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో నెలరోజులకు మందులు ఇవ్వగా ఇప్పుడు వారం రోజులకు.. అదీ అరకొరగా ఇస్తున్నారు. ఇదేమటని అడిగితే స్టాక్ లేదని సిబ్బంది, విజయవాడ నుంచే రావడం లేదు.. ఇండెంట్ పెట్టామని చెబుతూ ఉన్నతాధికారులు తప్పించుకుంటున్నారు. దీంతో పేద రోగులు ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. ఆస్పతుల్లో గ్లౌజులు, ఇంజక్షన్ల కొరత కూడా విపరీతంగా ఉంది. కేజీహెచ్‌లో రోజుకు వందకు గ్లౌజెస్ సెట్లు అవసరం కాగా పది సెట్లకు మించి ఉండడం లేదు. ఒక్కోసారి గ్లౌజులు లేకుండా ఆపరేషన్లు చేయాల్సి వస్తోందని వైద్యులు చెబుతున్నారు.

రోగుల కిటకిట

సీజన్ మార్పుతో జ్వరాలు విజృంభిస్తున్నాయి. రోగులతో కేజీహెచ్ కిటకిటలాడుతోంది. కేజీహెచ్‌కు ఉమ్మడి విశాఖ నుంచే కాకుండా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళం, ఒడిశా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి రోగులు వస్తుంటారు. వైద్యం అనంతరం నెల రోజులకు సరిపడా మందులు రోగులకు ఇచ్చి పంపేవారు. గత ప్రభుత్వ హయాంలో ఈ విధానం కచ్చితంగా అమలయ్యేది. కూటమి ప్రభుత్వం వచ్చాక మందుల కొరత ఏర్పడింది. సోమవారం నుంచి శనివారం వరకు ఇటు ఓపీలు, అటు మందుల కౌంటర్లు రద్దీగా ఉంటాయి. మందుల కోసం వచ్చే రోగులకు తీవ్ర నిరాశ ఎదురవుతోంది.


కిటకిటలాడుతున్న కేజీహెచ్‌లో మందులు ఇచ్చే గది

అన్ని మందులు ఇవ్వడం లేదు

గతంలో నెల రోజులకు సరిపడే మందులు ఇచ్చేవారు. ఇప్పుడు మందుల కొరత ఉండడంతో వారం రోజులకు మించి ఇవ్వడం లేదు. ఇందులో కూడా కొన్ని రకాల మందులు మాత్రమే ఇస్తున్నారు. మిగిలినవి ప్రైవేట్ మెడికల్ షాపుల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఆస్పత్రిలో మొత్తం 1,500 రకాల మందులు గతంలో ఉండేవి.. ఇప్పుడు కేవలం 300 రకాలు కూడా లేవని వైద్య సిబ్బంది చెబుతున్నారు. ఈ పరిస్థితి ఒక్క కేజీహెచ్‌లోనే కాకుండా ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ప్రభుత్వ మానసిక వైద్యశాల, ఈఎన్‌టీ ఆస్పత్రి, రాణి చంద్రమణి దేవి ఆస్పత్రి, టీబీ ఆస్పత్రుల్లోనూ ఉంది. క్షతగాత్రులకు డ్రెస్సింగ్ చేయడానికి అవసరమైన మందులు, సూదులు, కిట్స్ కూడా అందుబాటులో లేవు. ఎవరికైనా డ్రెస్సింగ్ కావాలంటే వారు బయట కిట్ కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు.

గతంలో ఆరోగ్యానికి పెద్దపీట

గత ప్రభుత్వ హయాంలో వైద్యం, ఆరోగ్యానికి పెద్దపీట వేశారు. రోగులకు అన్ని రకాల వైద్య సేవలు చేరువ చేశారు. వైద్యం పూర్తిగా అందించి కోలుకున్నాక.. మందులన్నీ ఇచ్చి మరీ పంపేవాళ్లు. పేదల ఆరోగ్యానికి గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భరోసాగా నిలిచింది. ఆ తరువాత వచ్చిన కూటమి ప్రభుత్వం రోగులకు చుక్కలు చూపిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు కూడా ఇవ్వలేని పరిస్థితులున్నాయి. మంచి రోజులు పోయి.. మందులు లేని రోజులు వచ్చాయంటూ రోగులు ఉసూరుమంటున్నారు.

మందులు నిల్ - కౌంటర్లు కిటకిట

కేజీహెచ్‌తోపాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు ఇచ్చే కౌంటర్లు కిటకిటలాడుతున్నాయి. కాని అక్కడ మందుల సంఖ్య చాలా తక్కువగా ఉండడంతో రోగులు నిరాశ చెందుతున్నారు. వైద్యులు రాసిన అన్ని మందులు దొరకడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు మెడికల్ షాపుల్లో మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పేదలకు ఆర్థిక భారం పడుతోంది.

క్లుప్తంగా

అంగన్‌వాడీ సరకుల పక్కదారిపై విచారణ


రంగిలిసింగి అంగన్‌వాడీ కేంద్రంలో విచారణ జరుపుతున్న సీఎస్‌డీటీ ప్రశాంత్

డుంబ్రిగుడ: మండలంలోని రంగిలిసింగి డీఆర్ డీపో పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయాల్సిన నిత్యావసర సరకులు పక్కదారి పట్టడంపై సీఎస్‌డీటీ ప్రశాంత్ మంగళవారం విచారణ జరిపారు. పాదువు సంఘం ఆధ్వర్యంలో నడుస్తున్న డీఆర్ డీపో పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు చేరాల్సిన సరకులను సక్రమంగా పంపిణీ చేయకుండా పక్కదారి పట్టిస్తున్నారని అంగన్‌వాడీ కార్యకర్తలు జిల్లా వినియోగదారుల సంఘం సమాఖ్యకు ఫిర్యాదు చేశారు. సరకుల పక్కదారిపై జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య సంఘం కార్యదర్శి ధర్మయ్య.. జాయింట్ కలెక్టర్ సొర్యమన్ పటేల్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన విచారణ చేపట్టాలని సీఎస్‌డీటీకు ఆదేశించారు. దీంతో విచారణ జరిపారు. సరకులు పక్కదారి పట్టినట్టు విచారణలో తేలిందని, సంబంధిత డిపో నిర్వాహకులపై క్రిమినల్ కేసు నమోదు చేయడంతో పాటు నిర్వాహణ బాధ్యత నుంచి తొలగించాలని నివేదికను అందించడం జరిగిందని ఆయన తెలిపారు. డిపో నిర్వాహణ బాధ్యతను సంబంధిత స్థానిక వీఆర్వోకు అప్పగించినట్టు సీఎస్‌డీటీ చెప్పారు.

బీజేపీ జిల్లా అధ్యక్షురాలిగా మఠం శాంతికుమారి


శాంతికుమారిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

పాడేరు: బీజేపీ అల్లూరి సీతామరామరాజు జిల్లా అధ్యక్షురాలిగా మఠం పంచాయతీ సర్పంచ్, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మంఠం శాంతికుమారి నియమితులయ్యారు. ఈ మేరకు ఆమెను కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు కురుసా ఉమామహేశ్వరరావు, పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు పాంగి రాజారావు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర మోహన్, ఇతర నేతలు ఘనంగా సన్మానించారు. జిల్లాలో పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేస్తానని ఈ సందర్భంగా శాంతికుమారి స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రవికుమార్, రామకృష్ణ, రాజారావు, రాఘువేంద్రరావు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించండి


జాతీయ బృందంతో ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది

ముస్కాన్ జాతీయ బృందం సీనియర్ అధికారి రియాజ్

రంపచోడవరం: ఏజెన్సీ ప్రాంతంలో చిన్నారుల ఆరోగ్యంపై వైద్యులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ముస్కాన్ టీమ్ (జాతీయ బృందం) సీనియర్ అధికారి డా. రియాజ్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఏరియా ఆసుపత్రిని బృందం సభ్యులు సందర్శించారు. ఆస్పత్రిలో వార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఏరియా ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలను జాతీయ బృందం పరిశీలించి సరిఫికెట్ ఇవ్వనుంది. రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి జాతీయ బృందాన్ని ఆస్పత్రిలో కలిశారు. ఏజెన్సీలో అందుతున్న వైద్య సేవలను వివరించారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ ఏజెన్సీలో ఆరోగ్య పరిస్థితులు, అందుతున్న వైద్య సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో ముస్కాన్ బృందం అధికారి, సీనియర్ చిన్న పిల్లల వైద్యనిపుణులు గోపాల్, స్టేట్ కోఆర్డినేటర్ రాకేష్, సూపరింటెండెంట్ శేషురెడ్డి, ఆర్ఎం ఇందిర, వైద్యులు పాల్గొన్నారు.


వైద్యసేవలు వివరాలు తెలియజేస్తున్న సబ్‌కలెక్టర్ కల్పశ్రీ, ఎమ్మెల్యే శిరీషాదేవి

సకాలంలో బాల సంజీవని కిట్ల పంపిణీ

సబ్ కలెక్టర్ కల్పశ్రీ


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు బాల సంజీవని కిట్లను సకాలంలో అందజేయాలని సంబంధిత అధికారులను రంపచోడవరం సబ్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ ఆదేశించారు. ఐటీడీఏ సమావేశ హాల్‌లో సీడీపీవోలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పాలు,గుడ్లు ఎలా సరఫరా అవుతున్నాయో సీడీపీవోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు నిర్మూలించే బాధ్యత ఐసీడీఎస్ అధికారులపై ఉందన్నారు. ప్రజలకు ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందేలా సచివాలయాల అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీడీపీవోలు సంధ్యారాణి, లక్ష్మి, లక్ష్మీ ప్రసన్న, దేవమణి తదితరులు పాల్గొన్నారు.


హాజరైన ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సన్నాహాలు

- ఉత్తరాంధ్రలో తుది ఓటర్లు 19 వేల మంది
- పోలింగ్ కేంద్రాలు, సిబ్బందిపై కసరత్తు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సమాయత్తమవుతోంది. ప్రస్తుతం ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీగా ఉన్న పాకలపాటి రఘువర్మ పదవీ కాలం ఈ ఏడాది మార్చి 29తో ముగియనుంది. ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆధ్వర్యంలో ఇప్పటికే ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తికావడంతో పోలింగ్ స్టేషన్లు, సిబ్బంది, ఇతర ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. అందుబాటులో ఉన్న సమాచారం మేరకు 123 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రతి మండల కేంద్రంలో ఒక పోలింగ్ స్టేషన్ ఉండేలా ప్రతిపాదించి, ఎన్నికల కమిషన్‌కు పంపారు. నామినేషన్ల స్వీకరణ విశాఖ కలెక్టర్ కార్యాలయంలోనే జరగనుంది. వచ్చే నెల 15 తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ జారీకానుంది. మార్చి మొదటి వారంలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది.

ఓటర్ల జాబితా ప్రకటన

ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల తుది జాబితాను గత నెల 30న అధికారికంగా ప్రకటించారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 19,523 మంది ఓటర్లుండగా ఈసారి స్వల్పంగా పెరిగి, 21,555 మందికి చేరింది. ఇందులో 12,948 మంది పురుషులు, 8,607 మంది స్త్రీలు ఉన్నారు. శ్రీకాకుళం 4,829 మంది, విజయనగరం 4,937 మంది, మన్యం పార్వతీపురం 2,262 మంది, అల్లూరి సీతారామారాజు జిల్లా 1,448 మంది, విశాఖలో 5,277 మంది, అనకాపల్లిలో 2,802 మంది ఓటర్లు ఉన్నారు.

ముగ్గురు యువకులకు గాయాలు

ఒకరి పరిస్థితి విషమం




చికిత్స పొందుతున్న యువకులు

చింతపల్లి: అతివేగంలో వచ్చిన ద్విచక్ర వాహనం ఒకరిని ఢీకొట్టింది. అతడితోపాటు మరో ఇద్దరు గాయపడిన సంఘటన చింతపల్లి సమీపంలో అంతర్లలో మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. చింతపల్లి పంచాయతీ మల్లవరం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు రింతాడ వైపు అతివేగంగా వెళ్తున్నారు. ఈ క్రమంలో అంతర్ల వద్ద రోడ్డు దాటుతున్న మరో యువకుడిని బలంగా ఢీకొట్టి ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో జీకేవీధి మండలం గాలికొండ పంచాయతీ పనసపల్లి గ్రామానికి చెందిన కొర్రా బాలయ్యకు రెండు కాళ్లు విరిగి తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడి పరిస్థితి విషమంగా ఉంది. మల్లవరం గ్రామానికి చెందిన కిల్లో నర్సింగరావు, కొర్రా బంగార్రాజులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వీరికి ఎముకల వైద్య నిపుణుడు ఇ. సాయికృష్ణ ప్రాథమిక వైద్య సేవలు అందించారు. అనంతరం మెరుగైన వైద్యానికి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాబేళ్ల సంరక్షణ కేంద్రాల ఏర్పాటు

కొమ్మాది(విశాఖ): భీమిలి బీచ్ రోడ్డు, సాగర్‌నగర్, జోడుగుళ్లపాలెం,చేపలుప్పాడ బీచ్ వద్ద అటవీ శాఖ ఆధ్వర్యంలో తాబేళ్ల సంరక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఏటా తాబేళ్లు తీరానికి చేరుకుని గుడ్లు పెడతాయి. వీటిని సేకరించి సంరక్షణ కేంద్రాల్లో భద్రపరుస్తారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో సిబ్బంది గుడ్లు సేకరించి భద్రపరుస్తారు. తాబేళ్ల గుడ్లను తొలుత తడి ఇసుక వేసి ఆ తరువాత రెండు పొరలుగా పొడి ఇసుక వేస్తారు. 40-45 రోజులు గడిచాక వేడికి గుడ్లు పొదిగి పిల్లలు బయటకు వస్తాయి. సముద్రంలో విడిచిపెట్టే ముందురోజు సాయంత్రం ట్రేలలో, గంపల్లో ఉంచుతారు. అవి ఉత్సాహంగా తిరిగి శక్తి సామర్థ్యాలను సంతరించుకునే వాతావరణం కల్పిస్తారు. మరుసటి రోజు సూర్యోదయం వేళ సముద్రంలోకి విడిచిపెడతారు.

డ్రైవర్లు విధిగా కంటి పరీక్షలు చేయించుకోవాలి


మాట్లాడుతున్న జిల్లా రవాణా అధికారి లీలాప్రసాద్

పాడేరు : ప్రైవేటు జీపు, ఆటోలు, ఇతర వాహనాలు నడుపుతున్న డ్రైవర్లు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని జిల్లా రవాణా అధికారి ఎస్. లీలా ప్రసాద్ తెలిపారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పాడేరు పట్టణంలోని దుర్గాదేవి గుడి ఆవరణలో ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెద్ద సంఖ్యలో డ్రైవర్లు హాజరై ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కోడి వాసు, కంటి వైద్యులు డి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సంస్కరణలతో పేద విద్యార్థులకు తీవ్ర నష్టం

విశాఖ విద్య: ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యా సంస్కరణలు నిరుపేద విద్యార్థులకు తీవ్ర నష్టం చేకూర్చే ప్రమాదం ఉందని ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ (ఏఐఎస్‌ఈసీ) అభిప్రాయపడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభాగం ఆధ్వర్యంలో 'ఇంటర్ సిలబస్-పరీక్షలు, భాషల బోధనలో ప్రతిపాదిత మార్పులు-పర్యవసానాలు' అనేఅంశంపై మంగళవారం వెబినార్ నిర్వహించారు. ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి ఎం.సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించగా, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.వేణుగోపాల్ రెడ్డి, ఎస్కే యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు రాచపాలెం చంద్రశేఖర రెడ్డి ఏ. చంద్రశేఖర్ (విశ్రాంత డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్, ప్రముఖ మానవ హక్కుల నాయకులు),డాక్టర్ అరవసుబ్రహ్మణ్యం రెడ్డి (తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, చిత్తూరు జిల్లా) వెబ్‌నార్‌లో పాల్గొని వివిధ అంశాలపై ప్రసంగించారు. విశాఖనుంచి డాక్టర్ అసోసియేషన్ జాతీయ ఉపాక్షుడు డాక్టర్ ఎన్ చంద్రశేఖర్, జాతీయ కార్యదర్శి ఎస్ గోవిందరాజులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఉపాధ్యాయులు, అధ్యాపకులు, జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, విద్యారంగ శ్రేయోభిలాషులు అనేకమంది పాల్గొని వారి అభిప్రాయాలు కూడా తెలియజేశారు. విద్యారంగంలో సంస్కరణలు తెచ్చేముందు స్టేక్ హోల్డర్స్‌ను సంప్రదించిన తరువాతనే ప్రభుత్వం ముందుకెళ్లాలని విద్యాశాఖ మంత్రికి విన్నవించేలా కమిటీ నిర్ణయించినట్లు అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్ చంద్రశేఖర్ తెలిపారు.

రికార్డులు లేకపోతే కేసులు నమోదు

ఆర్టీవో రాజేష్‌కుమార్

గంగవరం : ప్రతి వాహనదారుడు వాహనాలకు సంబంధించిన అన్ని రికార్డులు కలిగి ఉండాలని, లేక పోతే కేసులు నమోదు చేస్తామని ఆర్టీవో రాజేష్‌కుమార్ తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు సందర్భంగా గంగవరం హనుమాన్ ఆలయం వద్ద రోడ్డు భద్రతపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు రోడ్డు భద్రత, బీమా తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లో ఎక్కించరాదన్నారు. మరో అతిథి స్థానిక ఎస్ఐ బి.వెంకటేష్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలని కోరారు. ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని సూచిచారు. ఈ సదస్సులో ఆటో యూనియన్ నాయకులు రాంబాబు, రాధాకృష్ణ, శ్రీను, సుబ్బు, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్టీవో రాజేష్‌కుమార్, ఎస్ఐ వెంకటేష్

వయో వృద్ధుల సమస్యలపై రాజ్యసభలో చర్చిస్తా

ఎంపీ గొల్ల బాబూరావు

దాబాగార్డెన్స్(విశాఖ): దేశంలో వయో వృద్ధులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యసభలో చర్చిస్తానని, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు హామీ ఇచ్చారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జిల్లా సీనియర్ సిటిజన్స్ సంఘం వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గొల్ల బాబూరావు మాట్లాడుతూ తాను కూడా వయో వృద్ధుడినేనని, ఈ సంఘానికి రూ.10 వేలు చెల్లించి చీఫ్ పేట్రన్ సభ్యత్వం తీసుకున్నారు. దేశంలోని వయో వృద్ధులంతా ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. నగరంలో వయో వృద్ధులకు సామాజిక భవనం లేదని సంఘం చేసిన విజ్ఞప్తికి బాబూరావు స్పందించారు. సామాజిక భవనం నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానన్నారు. నాగార్జున విశ్వ విద్యాలయం పూర్వ ఉప కులపతి ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో వయోవృద్ధుల సామాజిక భవనానికి నగరాభివృద్ధి సంస్థ ద్వారా 1600 గజాల స్థలం కేటాయించారని, అప్పట్లో ఆ భవన నిర్మాణానికి మంత్రుల సమక్షంలో శంకుస్థాపన కూడా జరిగిందని, అయితే అది కార్యరూపం దాల్చకపోగా సుప్రీం కోర్టు తీర్పునకు విరుద్ధంగా ఆ స్థలాన్ని ప్రభుత్వం ఇతర ప్రయోజనాలకు కేటాయించిందన్నారు. దీనిపై ప్రభుత్వ అధికారులు స్పందించి, వేరొక స్థలం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కొత్తూరు మంగపతి, సెక్రటరీ జనరల్ డాక్టర్ పీకే జోష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ గొల్ల బాబూరావు

నాణేల జూదంలో ఎమ్మెల్యే గణబాబు అనుచరుడి అరెస్ట్

పెందుర్తి: నాణేలతో జూద మాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అనుచరుడ్ని నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. జీవీఎంసీ 89వ వార్డు టీడీపీ కార్యదర్శి గవ్వ భాస్కర్ సహా ఆరుగురి అరెస్టు చేసి వారి నుంచి రూ.62,200 స్వాధీనం చేసుకుని పెందుర్తి పోలీసులకు అప్పగించారు. యల్లపువానిపాలెనికి చెందిన 89వ వార్డు టీడీపీ కార్యదర్శి గవ్వ భాస్కర్ (జీవీఎంసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి),కొత్తపాలెనికి చెందిన షేక్ మదీనా, చంద్రనగర్‌కు చెందిన బర్రి శ్రీను, చంద్రనగర్‌కు చెందిన తుపాల నూకరాజు, బాజీ జంక్షన్‌కు చెందిన గండి దారబాబు, లక్ష్మీనగర్‌కు చెందిన దుక్క కిరణ్‌లు కలిసి కొత్తపాలెం-నరవ ప్రాంతంలో మూడు నాణేలు ఎగరేసి పందేలు కాస్తున్నారు. దీనిపై మెరుపుదాడి చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారందరినీ అరెస్టు చేసి పెందుర్తి పోలీసులకు అప్పగించారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పశ్చిమ ఎమ్మెల్యే గణబాబుకు సంక్రాంతి శుభాకాంక్షలు చెబుతూ గవ్వ భాస్కర్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ (ఫైల్)

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం : రైళ్ల రద్దీ, ప్రయాణికుల సౌకర్యార్థం కొన్ని రైళ్లకు శాశ్వతంగా, మరికొన్నింటికి తాత్కాలికంగా అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

- జసిద్ధి-తాంబరం(12376) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 22వ తేదీ నుంచి, తాంబరం-జసిద్ధి(12375) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 25వ తేదీ నుంచి శాశ్వత ప్రాతిపదికన ఒక జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌ను జతచేస్తున్నారు.
- హతియా-ఎస్ఎంవీ బెంగళూరు(12835) ఎక్స్‌ప్రెస్‌కు మార్చి 25వ తేదీ నుంచి, ఎస్ఎంవీ బెంగళూరు-హతియా (12836) ఎక్స్‌ప్రెస్‌కు మార్చి 27వ తేదీ నుంచి 2-జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లను శాశ్వత ప్రాతిపదికన జతచేస్తున్నారు.
- విల్లుపురం-ఖరగ్‌పూర్(22604) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 21 నుంచి ఫిబ్రవరి 18వ తేదీ వరకు, ఖరగ్‌పూర్-విల్లుపురం(22603)ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 23 నుంచి ఫిబ్రవరి 20వ తేదీ వరకు 1-స్లీపర్‌క్లాస్ కోచ్‌ను తాత్కాలికంగా జతచేస్తున్నారు.
- తిరునల్వేలి-పురులియా(22606) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 22 నుంచి ఫిబ్రవరి 19వ తేదీ వరకు, పురూలియా-తిరునల్వేలి(22605)ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 24 నుంచి ఫిబ్రవరి 21వ తేదీ వరకు 1-స్లీపర్ క్లాస్ కోచ్ తాత్కాలికంగా జతచేస్తున్నారు.

ఘనంగా ఐఎన్ఎస్ కిర్చ్ వార్షికోత్సవం

సింధియా: ఈస్టర్న్ ఫ్లీట్ ఆఫ్ ఇండియన్ నేవీకి చెందిన బలీయమైన క్షిపణి కార్వెట్ ఐఎన్ఎస్ కిర్చ్ 24వ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించినట్టు నేవీ వర్గాలు తెలిపాయి. ఈ యుద్ధ నౌక ప్రాజెక్ట్ -25ఏ మిస్సైల్ కొర్వెట్టిస్ రెండో నౌకగా జనవరి 22వ తేదీ 2001వ సంవత్సరం నుంచి తన సేవలందిస్తోంది. 1,500 టన్నుల బరువు ఉన్న ఈ యుద్ధనౌక 25 నాటికల వేగాన్ని అధిగమిస్తూ ప్రయాణించడం దీని ప్రత్యేకత.


వార్షికోత్సవాన్ని జరుపుకొంటున్న ఐఎన్ఎస్ కిర్చ్